ఓం నమః శివాయ!

- భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి
- మారుమోగిన శివనామస్మరణ
- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పణ



కోవెలకుంట్లలోని పంచముఖ సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు

బనగానపల్లెరూరల్: మహాశివరాత్రి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య సాగాయి. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో శివాయాల్లో కొలువైన స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముక్కంటి ఆలయాల్లో ఓం నమఃశివాయ నామస్మరణం మారుమోగింది. ప్రత్యేకించి ప్రముఖ యాగంటి శైవక్షేత్రం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఏకశిలా రూపంలో కొలువైన పార్వతిపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేశారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహేశ్వరస్వామికి పట్టువస్త్రాల సమర్పణ కార్యక్రమం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. తిరుమలతిరుపతి దేవస్థానం డైరెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మతో పాటు టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీ సభ్యులు మారుతిప్రసాద్ దంతులు ఉదయం 5 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, కుంకుమార్చన, సహస్రనామావళి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివపార్వతులకు తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి తెచ్చిన పట్టువస్త్రాలను వారు సమర్పించారు. ప్రజలు సంతోషంగా ఉండాలని మహేశ్వరులను కోరుకున్నట్లు తెలిపిన టీటీడీ డైరెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఇప్పటి నుంచి ప్రతియేటా మహాశివరాత్రి సందర్భంగా మహేశ్వరస్వామివారికి టీటీడీ నుంచి పట్టువస్త్రాలను సమర్పిస్తామన్నారు. రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న యాగంటి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం టీటీడీ కల్యాణ మండప నిర్మాణం చేపడుతామని టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం తెలిపారు.

జాగారణకు తరలివచ్చిన భక్తులు

మహాశివరాత్రి సందర్భంగా యాగంటి క్షేత్రంలో జాగారణ చేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి లింగోద్భం కార్యక్రమం, తెల్లవారుజామును జరిగే స్వామి, అమ్మవార్ల కల్యాణం జరుగనున్న నేపథ్యంలో తరలి వచ్చిన భక్తులతో యాగంటి క్షేత్రం కిటకిటలాడింది. అవుకు మండల జెడ్పీటీసీ సభ్యురాలు దివంగత ఎమ్మెల్సీ చల్లాభగీరథరెడ్డి సతీమణి శ్రీలక్ష్మి, ఆమె కుమారుడు రాజ్యాభిషేక్‌రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. క్షేత్రం ఆవరణలో నిర్వహించిన రేలారేలా, జబర్దస్త్ బృందం గడ్డం నవీన్, నేమలిరాజు, వినోద్ ప్రదర్శించిన ప్రత్యేక హాస్యం అలరించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ పర్యవేక్షణాధికారి హరిశ్చచంద్రారెడ్డి, కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, చైర్మన్ బుచ్చిరెడ్డి పర్యవేక్షించారు. బనగానపల్లె సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐలు రామిరెడ్డి, జగదీశ్వర రెడ్డి, రాకేష్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నిత్యాన్నదాన సంస్థ సభ్యులు దస్తగిరెడ్డి, రామారెడ్డి,దొనపాటియాగంటి రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బండిబ్రహ్మానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శనివారం తెల్లవారు జామునుంచే శివనామస్మరణతో శివాలయాలు మారుమోగాయి. పెట్నికోట సమీపంలోని ప్రసన్న పార్వతీ గుండుమల్లేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, కోవెలకుంట్ల మార్కెట్ యార్డు మాజీ అధ్యక్షుడు బీవీ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం ఎమ్మెల్యే కాటసానిని శాలువాతో సత్కరించి అశీర్వచనాలు అందించారు. ప్రత్యేక పల్లకీలో స్వామివారి ఉత్సవ మూర్తులకు పెట్నికోట, నాయినపల్లె గ్రామాల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ప్రసన్న పార్వతి గుండు మల్లేశ్వరస్వామి కల్యాణం వేదమంత్రోచ్చారణల మధ్య జరిపించారు. జెడ్పీ చైర్మన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. బాల నాగమ్మ నాటక ప్రదర్శన ఆకట్టుకుంది. కొలిమిగుండ్లలోని లలితా సుందరేశ్వరస్వామి ఆలయంలో రామ్‌కో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్యాపిలి: మండల కేంద్రంతో పాటు పెద్దపొదిళ్ల, కాకనవరం, పీఆర్ పల్లి, గొల్లపల్లి బుగ్గ తదితర గ్రామాల్లో మహా శివరాత్రి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయంతో పాటు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయాలకు తెల్లవారుజామున నుంచే భక్తులు పోటెత్తారు. శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రాత్రి ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించిన ప్రజలు రాత్రంతా జాగరణ చేశారు.

బనగానపల్లెరూరల్: మండలంలోని పలుకూరులో వెలసిన శ్రీ రామేశ్వరస్వామి ఆలయంలో శనివారం మహాశివరాత్రి ఉత్సవాల్లో ఘనంగా జరిగాయి. ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రాష్ట్ర వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మోసు శ్రీనివాసులు,జగదీశ్వర రెడ్డి,వడ్డె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బేతంచెర్ల : మండలంలో శనివారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. హెచ్ కొట్టాల గ్రామ సమీపాన వెలసిన ముచ్చట్ల భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి భ్రమరాంభ, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకము, కుంకుమార్చన, మహామంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. ఆర్‌యస్ రంగాపురం నుంచి స్వామి,అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను నందికోల సేవతో ఊరేగింపుగా ఆలాయానికి చేరుకున్నారు. పట్టణంలోని పూదోట మఠంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.



శివపార్వతులకు టీటీడీ పట్టువస్త్రాలను సమర్పిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, టీటీడీ సభ్యులు మారుతిప్రసాద్



ఆలయంలోని ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు



యాగంటిలో నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

డోన్ టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణ సమీపంలోని కొత్త, పాత బుగ్గ రామలింగేశ్వర స్వామి దేవాలయాలతో పాటు పట్టణ పోలీస్ స్టేషన్ సమీపంలోని శ్రీ సాంబశివాలయం, వైఎస్ నగర్‌లోని శివాలయం, ఇందిరానగర్, ప్రభుత్వ ఐటీఐ, పాతపేట రాముల దేవాలయం, శ్రీనగరేశ్వర స్వామి ఆలయం శివనామస్మరణంలో మారుమోగాయి. స్వామి,అమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, మంగళహారతులను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జాగరణలో భాగంగా కాలక్షేపం కోసం పాతబుగ్గ, కొత్తబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయాల ఆవరణలో పురాణాలు, ఇతిహాసాలు, హరికథ, బుర్రకథలు ఏర్పాటు చేశారు. పాతబుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ఆవరణలో రంగు రంగుల శివలింగం ప్రతిమను రూపొందించి జ్యోతులను వెలిగించి పూజించారు.



ప్రత్యేక అలంకరణగా ఏర్పాటు చేసిన రంగు రంగుల శివలింగాకారం చుట్టూ దీపాలు వెలిగించిన దృశ్యం

కోవెలకుంట్ల: శివరాత్రి పర్వదినాన్ని పురష్కరించుకుని బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని శివాలయాలు శనివారం శివన్మామస్మరణంతో మార్మోగాయి. స్థానిక గాంధీసెంటర్‌లో వెలసిన సిద్ధేశ్వరస్వామి, కాశీవిశ్వనాథుని ఆలయాలు, ఏడుకొప్పెర్ల బావి సమీపంలో వెలసిన అగస్తీశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్‌లోని అయ్యప్పస్వామి దేవాలయ ఆవరణలో వెలసిన శివాలయం, బనగానపల్లె చౌరస్తాలో నాగలింగేశ్వర స్వామి, పట్టణ శివారులోని జుర్రేరు ఒడ్డున ఉన్న శివాలయంతోపాటు పాటిమీద పాత శివాలయం, మండలంలోని వెలగటూరు, బిజనవేముల, భీమునిపాడు, గుళ్లదూర్తి గ్రామాల్లో వెలసిన ఆలయాల్లో శివరాత్రి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు. పండగను పురష్కరించుకుని తెల్లవారుజాము నుంచి ఆలయాల్లో వేద పండితుల ఆధ్వర్యంలో అభిషేకం, బిల్వార్చన, క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, కలశస్థాపన, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ జపాలు, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వివిధ ఆలయాల పరిధిలో స్వామివార్ల గ్రామోత్సవం అత్యంతవైభవంగా నిర్వహించారు. అలాగే మత సామరస్యానికి ప్రతీకగా పట్టణ శివారులోని జుర్రేరు ఒడ్డున అగస్తీశ్వర ఆలయంలో మొదటి రోజు శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం నుంచి నూర్‌షావలి దర్గాలో గంధం, ఉరుసు వేడుకలు ప్రారంభం కానున్నాయి.



బేతంచెర్లలో శివునికి పూజలు చేస్తున్న మహిళలు



ప్యాపిలి నీలకంఠేశ్వర స్వామి ఆలయానికి తరలివచ్చిన భక్తులు



పలుకూరులో ధ్వజారోహణలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

శ్రీ మద్దిలేటయ్య ఆదాయం రూ.3,38,102

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలసిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని దర్శించుకునేందుకు శనివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండదీపం, విరాళాలు, కల్యాణకట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.3,38,102 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు. అదేవిధంగా స్వామివారి ఆలయ పునర్నిర్మాణానికి డోన్ పట్టణానికి చెందిన మారం శంకర్ రెడ్డి, వెంకట చిన్నమ్మ జ్ఞాపకార్థం వెంకటేశ్వరెడ్డి రూ.1,00,116 లక్షలు, తెలంగాణా రాష్ట్రం గద్వాల పట్టణానికి చెందిన మద్దిలేటి రూ.50 వేలు, కర్నూలు పట్టణానికి చెందిన కురువ దండు వెంగన్న రూ.25 వేల విరాళం అందజేశారు.

ఘనంగా శని త్రయోదశి వేడుకలు



ధర్మగిరి పీఠంలో వెలసిన శనీశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండల పరిధిలోని అంబాపురం గ్రామ సమీపాన ఉన్న ధర్మగిరి పీఠంలో వెలసిన శనిశ్వరస్వామికి శనిత్రయోదశిని పురస్కరించుకుని భక్తులు తో ప్రత్యేకపూజలు చేశారు. ధర్మగిరి పీఠం నిర్వాహకులు పాలెం పుల్లారెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో శనీశ్వరస్వామికి తైలాభిషేకం, కుంకుమార్చన, నైవేద్యం సమర్పించి మహామంగళహారతి నిర్వహించారు. ఆయా గ్రామాల్లో కొలువైన ఆలయాల్లోని నవగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని నందవరంలో వెలసిన శ్రీ చౌడేశ్వరీదేవి ఆలయ అభివృద్ధికి శనివారం కోవెలకుంట్ల మండలం జోలదరాశి గ్రామానికి చెందిన సింగారెడ్డి సుదర్శన్‌రెడ్డి రూ.25వేలు విరాళాన్ని ఈఓ రామానుజన్‌కు అందజేశారు. దాత సింగారెడ్డి సుదర్శన్ రెడ్డిని సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఈఈ మెరిట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ



హర్షిత

కోవెలకుంట్ల: ఎడ్యుకేషన్ ఎసెఫని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మెరిట్ టెస్ట్ ఫలితాల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న హర్షిత సత్తాచాటింది. స్థానిక గాంధీనగర్‌లో నివాసం ఉంటున్న మాజీ సైనిక ఉద్యోగి పెద్దిరెడ్డి కుమార్తె హర్షిత రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 25వేలు బహుమతి దక్కించుకుంది. హెచ్ఎం అరుణ కుమారి, ఉపాధ్యాయుడు సంజీవరాయుడు హర్షితను అభినందించారు.

వైవీ రావు మృతి తీరనిలోటు



నివాళులర్పిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

డోన్ రూరల్ : ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు వైవీ రావు మృతి ఏఐటీయూసీకి తీరనిలోటని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్‌బాబు పేర్కొన్నారు. స్థానిక నక్కిరామన్న భవనంలో శనివారం వైవీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన పోరాటాలను ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రసిడెంట్ లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా రామకృష్ణాపురం రోడ్డు పనులు



కల్వర్టు నిర్మాణ పనులు చేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని కనుమకింది కొట్టాల గ్రామం నుంచి బనగానపల్లె మండలం రామకృష్ణాపురం గ్రామం వరకు చేపట్టిన రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో 3.50 కిలోమీటర్ల బీటీ రహదారి నిర్మాణానికి రూ.4 కోట్ల నిధులు మంజూరయ్యాయి. రహదారి నిర్మాణంతోపాటు ఐదు కల్వర్టులు నిర్మిస్తున్నట్లు పంచాయతీ రాజ్ ఇంజినీర్ గణేష్ తెలిపారు.

హోరా హోరీగా సాగిన పోటీలు



పోటాపోటీగా తలపబడుతున్న కబడ్డీ క్రీడాకారులు

కొలిమిగుండ్ల: మహాశివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని పెట్నికోట గుండుమల్లేశ్వరస్వామి క్రీడా మైదానంలో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీలు శనివారం ముగిశాయి. కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలు తిలకించేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రేక్షకులు కేరింతలు కొడుతు క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, రామ్‌కో సిమెంట్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రెడ్డినాగరాజు క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ఆసక్తిగా తిలకించారు. వచ్చే ఏడాది నిర్వహించే కబడ్డీ పోటీలకు రామ్‌కో తరపున క్రీడాకారుల సౌకర్యం కోసం మ్యాట్ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో క్రీడాకారులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. పోటాపోటీగా సాగిన కబడ్డీ పోటీల్లో పెట్నికోట ఉన్నత పాఠశాల జట్టు మొదటి, అదే గ్రామానికి చెందిన ప్రసాద్ జట్టు రెండవ స్థానంలో నిలిచింది. వైఎస్ఆర్ కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన ఆర్‌సీబీ జట్టు మూడవ స్థానం, కొలిమిగుండ్ల జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు,రూ.8వేలు అందించారు. అలాగే బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నంద్యాల నందిపైప్స్ జట్టు మొదటి స్థానాన్ని కైవసం చేసుకోగా చిత్తూరు జిల్లా నగరి జట్టు రెండవ స్థానం, నంద్యాల జట్టు మూడవ, కడప జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.15వేలు, రూ.10వేలు,రూ.8 వేలు,రూ.6వేలు చొప్పున నగదు బహుమతులను జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు మొలక రాజారెడ్డి, పేరం సత్యనారాయణరెడ్డి, రామాపురం, హరివరం హెచ్ఎంలు భాస్కర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, పీడీ వెంకటేశ్వర్లు, భుజంగరావు, హరికృష్ణ, శ్రీనివాసులు, శేఖర్, షేక్షావలి, పీఈటీలు సాంబశివారెడ్డి, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు త్వరితగతిన దర్శనం కల్పించండి



శ్రీశైలం ఆలయ ప్రాంగణంలో పాగాలంకరణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్లన్న దర్శనార్థం వచ్చిన భక్తులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన స్వామివారి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శనివారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ కె.నిషాంతి, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ రెడ్డివారి చక్రపాణి రెడ్డి, ఈఓ ఎస్‌లవన్నతో కలిసి క్షేత్రంలో పర్యటించారు. క్యూలైన్లలో పలు చోట్ల మంచినీటి కొరత ఉన్నట్లు భక్తులు కలెక్టర్ దృష్టికి తేగా యుద్ధప్రాతిపదికన మంచినీటి సదుపాయం కల్పించారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణం బ్రహ్మాండరాయ గోపురం, పాగాలంకరణ, స్వామిఅమ్మవార్ల కల్యాణోత్సవానికి చేసిన ఏర్పాట్లును పరిశీలించారు.

దేవరబండలో బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

డోన్ రూరల్: మండల పరిధిలోని దేవరబండ గ్రామంలో శనివారం దేవరబండ తిమ్మగురుడు స్వామి, మహాశివరాత్రి పండుగ సందర్భంగా నిర్వహించిన పాలపళ్ల విభాగం ఎద్దుల రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు సర్పంచ్ డి.పద్మావతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మహేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు మధుసుధన్‌రెడ్డి, సర్వోత్తంరెడ్డి ప్రారంభించారు. హోరాహోరీగా సాగిన పోటీలలో నంద్యాల జిల్లా పాణ్యం మండలం, ఎస్.కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రహ్మణ్యంరెడ్డి వృషభాలు మొదటి, రెండవ స్థానాల్లో నిలిచి రూ. 40వేలు, రూ. 30వేలను కైవసం చేసుకున్నాయి. తర్వాత స్థానాల్లో కర్నూలు జిల్లా, వెల్దుర్తి మండలానికి చెందిన మనోహర్ యాదవ్ వృషభాలు, నంద్యాల జిల్లా, డోన్ మండలం, కొత్తబురుజు గ్రామానికి చెందిన నాగేష్ వృషభాలు, నంద్యాల జిల్లా, ప్యాపిలి మండలం, డి.రంగాపురం గ్రామానికి చెందిన మహేంద్రరెడ్డి వృషభాలు, డోన్ మండలం, ఉంగరానిగుండ్ల గ్రామానికి చెందిన విజయ్ వృషభాలు నిలిచాయి. వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 20వేలు, రూ. 10వేలు, రూ. 5 వేలు, రూ. 3వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరాములు, లక్ష్మినారాయణరెడ్డి, రవి, అంజి, రఘురామిరెడ్డి, గోవింద్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

● గడ్డివాములు దగ్ధం



బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురంలో శనివారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని గడ్డివాములు దగ్ధమయ్యాయి. చాకలి ఎర్రగుడి చిన్న మద్దిలేటి పశవుల కోసం కల్లంలో 12 ట్రాక్టర్ల జొన్నసొప్ప, వరిగడ్డి నిల్వ ఉంచుకున్నాడు. గడ్డివాముల నుంచి మంటలు రావడంతో గమనించిన గ్రామస్తులు ఆర్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. సమాచారం మేరకు వచ్చిన డోన్ ఫైరింజన్ సిబ్బంది పక్కవాములకు మంటలు వ్యాపించకుండా అదుపు చేశారు.

● డీసీఎం వాహనం బోల్తా

కోవెలకుంట్ల: సంజామల మండలం పేరుసోముల సమీపంలో శనివారం డీసీఎం వాహనం బోల్తా పడింది. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. విజయవాడ నుంచి అనంతపురం పట్టణానికి సబ్బులు, సర్ఫ్‌ప్యాకెట్ల లోడుతో వెళ్తున్న డీసీఎం అదుపు తప్పింది. వాహన యజమాని అయిన డ్రైవర్ వెంకట నాయుడు ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. సంఘటనపై సంజామల పోలీసులు విచారణ చేపట్టారు.

నేటి కార్యక్రమాలు

☛ చత్రపతి శివాజీ జయంతి

బేతంచెర్ల: దేశ సమైక్యత, హిందూ ధర్మం కోసం పోరాడిన చత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు విశ్వ హిందూ పరిషత్ నంద్యాల జిల్లా ఉపాధ్యక్షులు బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక వికాస నిలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌరిపేటలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శివాజీ చిత్ర పటానికి నివాళులరిపించిన అనంతరం బైక్ ర్యాలీ చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు రెడ్డి, బుగ్గన మహేశ్వర్‌రెడ్డి, నాగ మోహన్, రామూర్తి, అజయ్, శ్రీనివాసులు, గోవిందు పాల్గొన్నారు.

☛ రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కొలిమిగుండ్ల: పెట్నికోట సమీపంలోని గుండు మల్లేశ్వరస్వామి క్రీడా మైదానంలో శివరాత్రి ఉత్సవాల సందర్భంగా జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ఉదయ్‌భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు పాలపళ్ల సైజు, రెండో రోజు సోమవారం యుకేటగిరి విభాగం పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



నాడు నల్లమేకల పల్లె - డి.రంగాపురం వరకు గల రోడ్డు దుస్థితి(ఫైల్)



నేడు విశాలంగా మెరుస్తున్న నల్లమేకలపల్లె - డి.రంగాపురం రోడ్డు

నల్లమేకలపల్లె రోడ్డు కళకళ!

డోన్ : డోన్ నియోజవకర్గంలో ఏళ్లతరబడి కనీసం మరమ్మతులకు నోచుకోని రోడ్లకు మహర్దశ పట్టుకుంది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో నిధులు మంజూరు చేయిస్తుండడంతో రహదారులు కళకళలాడుతున్నాయి. గుంతలమయమైన ప్యాపిలి మండలం నల్లమేకల పల్లె నుంచి దెయ్యాలమడుగు, రంగాపురం రోడ్డు ప్రస్తుతం కళకళలాడుతోంది. విశాలంగా నాలుగు లైన్ల రోడ్డు వేయించడంతో ప్రయాణం సులువుగా మారింది. గతడాది నియోజకవర్గ కేంద్రం డోన్ నుంచి రూ.40కోట్లతో 36 కిలోమీటర్ల దూరంలోని నల్లమేకలపల్లె గ్రామం వరకు రహదారిని నిర్మించిన విషయం తెలిసిందే. అయితే అనంతపురం జిల్లా యాడికి, రాయలచెరువు పరిసర గ్రామాల ప్రజలతో ప్యాపిలి మండల ప్రజల మధ్య పరిచయాల నేపథ్యంలో మంత్రి ప్రత్యేక చొరువతో రూ.7.10 మంజూరవ్వగా నల్లమేకలపల్లె నుంచి డి.రంగాపురం వరకు నాలుగు కిలోమీటర్ల నూతనంగా రోడ్డును నిర్మించారు. దీంతో నియోజకవర్గ కేంద్రం డోన్ నుంచి నేరుగా కొచ్చెర్వు, బావిపల్లె, నల్లమేకలపల్లె, డి.రంగాపురం, అనంతపురం జిల్లా యాడికి, రాయ లచెరువు, తాడిపత్రి వరకు సులువుగా ప్రయాణించే అవకాశం కలిగింది. ఆయా గ్రామాల ప్రజలు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు.